క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రత్తిపాటికి మాతృవియోగం



చిలకలూరిపేట: ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తి ప్రత్తిపాటి నారాయణమ్మ (85) బుధవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్య కారణాలతో ఆమె హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ అక్కడే తుది శ్వాస విడిచారు. ఆమె మృతదేహాన్ని చిలకలూరిపేటకు తీసుకువచ్చి, గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఎం.అనూరాధ ఆదేశాల మేరకు వినుకొండ మండలం నరగాయపాలెం సెక్టార్ పరిధిలోని నాగిరెడ్డిపల్లిలోని నిర్మల హైస్కూల్‌లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.నాగరాజుకుమారి పాల్గొని పోషకాహారం గురించి వివరించారు. మునగాకు తప్పనిసరిగా వంటలలో వాడాలని, ప్రోటీన్స్, విటమిన్‌లు ఉన్న ఆహారం తీసుకోవాలని కోరారు. అనంతరం కిశోర బాలికలకు హెచ్‌బీ టెస్టులు చేశారు. గ్రామంలో పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిద్ధార్థ, ఎంఎల్‌హెచ్‌పీ శివపార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.కోమలిదేవి, పి.మెర్సి, సుజాత, ఎ.ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, ఏపీ పద్మావతి, కె.హైమావతి, ఎం.ఎస్‌కే కాశింబి పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం రూ.2 లక్షల సహాయం

నరసరావుపేట: జనసేన పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు మేడిశెట్టి రామారావు ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం అవనిగడ్డకు బుధవారం రూ.2 లక్షల విలువైన దుస్తులు, సరుకులు, మందులు పంపించారు. వీటిని తీసుకెళుతున్న వాహనానికి పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని జెండా ఊపి ప్రారంభించారు.

పంట కోత ప్రయోగాలను పక్కాగా నిర్వహించాలి

నరసరావుపేట రూరల్: పంట కోత ప్రయోగాలను శాస్త్రీయ విధానంలో పక్కాగా నిర్వహించాలని ఏఎస్‌ఓ నాగేంద్రబాబు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం పంటకోత ప్రయోగాలపై వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ నాగేంద్రబాబు మాట్లాడుతూ పంట కోత ప్రయోగం, పంట నమోదు కచ్చితంగా నిర్వహించడం ద్వారా దిగుబడి అంచనా వేయడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా మార్కెట్లో ఆయా పంట ఉత్పత్తుల ధరల నిలకడగా ఉండే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయని తెలిపారు. గ్రామ సరాసరి ఉత్పత్తి తెలుసుకునేందుకు పంట నమోదును రైతులు తప్పని సరిగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



నిమజ్జనానికి తరలుతున్న గణనాధుడు

నరసరావుపేట రూరల్: మూడు రోజుల పాటు పెదరెడ్డిపాలెంలోని బొడ్రాయి సెంటర్‌లో పూజలందుకున్న గణనాథుడు బుధవారం నిమజ్జనానికి తరలివెళ్లాడు. గత 13 సంవత్సరాలుగా గ్రామంలోని రెడ్డిస్ యూత్ ఆధ్వర్యంలో చవితిపందిరిని ఏర్పాటుచేసి గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్నారు. వేడుకలలో భాగంగా మంగళవారం నిమజ్జన ఊరేగింపు వైభవంగా జరిపారు. 13కేజీల లడ్డూను కందుల శేషిరెడ్డి రూ.77,750లకు దక్కించుకున్నారు.

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో ఆర్యవైశ్య వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనం కార్యక్రమం బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. శావల్యాపురం గ్రామానికి చెందిన వినాయక విగ్రహాన్ని రెడ్డి కృష్ణ- లక్ష్మి దంపతులు వితరణ చేయగా 11 కేజీల లడ్డూను గట్టుపల్లి వీరాంజినేయులు-నాగ మల్లేశ్వరి దంపతులు అందజేశారు. వినాయక విగ్రహం లడ్డూను బహిరంగ వేలంపాటలో గ్రామానికి చెందిన పద్మనాభుని హనుమంతరావు రూ.39 వేలకు కైవసం చేసుకున్నారు.

కోలాహలంగా గణేశ్ నిమజ్జనాలు

నాదెండ్ల: మండలంలో గణేశ్ నిమజ్జనాలు బుధవారం కోలాహలంగా సాగాయి. 24 విగ్రహాల నిమజ్జనం చేశారు. గణపవరం శాంతినగర్‌లో కింగ్ బాయ్స్ ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద చిన్నారుల కోలాట ప్రదర్శన, శివుని వేషధారణలో నృత్య ప్రదర్శన స్థానికులను ఆకట్టుకున్నాయి. చవిటిపాలెం లడ్డూ వేలం నిర్వహించగా బత్తుల ప్రసాద్ రూ.7500లకు దక్కించుకున్నాడు.

నరసరావుపేట ఈస్ట్: ఎన్‌జీఓ కాలనీ పందిరిలో గణపతితో పాటు పూజలందుకున్న 21 కేజీల లడ్డూను వేలం పాటలో రూ.71 వేలకు మురహరి శ్రీనివాసరావు, చిన్న లడ్డూను రూ.25 వేలకు కామినేని అనూరాధ దక్కించుకున్నారు. టెలిఫోన్ ఎక్స్చేంజ్ వద్ద గల పందిరిలోని గణనాథుడిని బుధవారం 1,108 లడ్డూలతో సహస్ర అష్టోత్తర పూజ నిర్వహించారు.

నరసరావుపేట: లాల్‌బహుదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చవితి పందిరిలో బుధవారం నిర్వహించిన వేలంలో స్వామివారి లడ్డూ పెన్నంశెట్టి వెంకటసుధాకర్ రూ.56 వేలకు దక్కించుకున్నారు. అలాగే రూ.1.25లక్షల విలువైన హోండా యాక్టీవ ద్విచక్ర వాహనానికి నిర్వహించిన లాటరీలో 1046 నంబరు గల రామిశెట్టి సిద్ధార్థనందన్ విజేతగా ప్రకటించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు లాటరీ తీసి విజేతను ఎంపిక చేశారు.

రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడులోని యానాది కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

స.హ. చట్టంపై అవగాహన ఉండాలి

శావల్యాపురం: సమాచార హక్కు చట్టంపై రైతులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. బుధవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఆర్టీఐ కమిషనర్ ఆదేశాలు మేరకు ప్రభుత్వ నిబంధనలు మేరకు చలానా రూపంలో నగదు చెల్లించిన వారికి సమాచారం అడిగిన వారికి నెలరోజుల వ్యవధిలో అందజేస్తామన్నారు. సమావేశంలో ఏఈఓ పురేటి అశోక, వీఏఏ వెంకయమ్మ పాల్గొన్నారు.

ఈపూరులో..

ఈపూరు: ఆర్‌టీఐ యాక్ట్ కమిషన్ ఆదేశాల ప్రకారం మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై కేంద్రం సిబ్బందికి, రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో రామారావు మాట్లాడారు.

చిలకలూరిపేటలో..

చిలకలూరిపేట: సమాచార హక్కు చట్టం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ తెలిపారు. మండలంలోని కావూరు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సమాచార హక్కు చట్టం -2005 పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దాతకు సన్మానం



నాదెండ్ల: గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి సాతులూరు సమీపంలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న రెడ్డి పేరంటాలమ్మ ఆలయం నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇటీవల ఆలయ నిర్మాణానికి గోల్కొండ గ్రూపు సంస్థల ఛైర్మన్ నడికట్టు రామిరెడ్డి రూ.2 లక్షలు విరాళంగా అందించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఆయనతో పాటూ యన్నం శివారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయం చేద్దాం



పార్టీ కార్యాలయంలో నాయకుల సమక్షంలో కేకు కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: విజయవాడ వరద బాధితులకు అండగా ఉందామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యకర్తలు, నాయకులు ముందస్తు జన్మదిన కేక్‌ను బుధవారం కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం జన్మదిన సందర్భంగా ఎవరూ రావొద్దని కోరారు. విజయవాడకు వెళ్లి వరద బాధితులకు కావాల్సిన దుస్తులు, దుప్పట్లు అందజేద్దామని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, వైస్ ఎంపీపీ వెంకటప్పారెడ్డి, నాయకులు ఎం.శ్రీనివాసరావు, సిహెచ్.రాధాకృష్ణారెడ్డి, ఎం.రవీంద్రారెడ్డి, వి.గుడిజాన్, గురవాయపాలెం, అల్లూరువారిపాలెం గ్రామ సర్పంచులు మాణిక్యరావు, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

అధ్యాపకురాలు కుమారికి పీహెచ్‌డీ



నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కె.నర్సుకుమారి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పొందినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భార్గవ్‌భూషణ్ బుధవారం తెలిపారు. రసాయన శాస్త్రంపై మక్కువతో హెచ్‌పీఎల్‌సీ మెథడ్ డెవలప్మెంట్ మరియు వాలిడేషన్ అనే అంశంపై నర్సుకుమారి పరిశోధన పత్రం సమర్పించినట్టు తెలిపారు. పీహెచ్‌డీ సాధించిన నర్సుకుమారిని కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి, కళాశాల డీన్ ఎం.లక్ష్మీసురేఖ, అధ్యాపకులు అభినందలు తెలిపారు.

ఆర్మీ క్యాంప్‌కు ఎన్‌సీసీ క్యాడెట్స్

నరసరావుపేట రూరల్: సికింద్రాబాద్‌లోని 1-ఈఎంఈ ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న ఆర్మీ క్యాంప్‌కు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఆరుగురు ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించే ఈ శిబిరం ప్రత్యేకమైనదని తెలిపారు. పదిరోజుల పాటు శిక్షణ శిబిరంలో ఆర్మీ ఉద్యోగానికి అవసరమయ్యే అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. క్యాంప్‌కు ఎంపికైన క్యాడెట్స్‌ను ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్, అధ్యాపకులు అభినందించారు.

ఇచ్చిన హామీలు అమలు చేయండి

నరసరావుపేట: టీడీపీ ఎన్నికలలో భవన నిర్మాణ కార్మికులు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని పల్నాడు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) నియోజకవర్గ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలార్ మసూద్ మాట్లాడుతూ మెమో నెంబర్ 1214 రద్దుచేసి సంక్షేమ బోర్డు నుంచి రావాల్సిన రూ.6కోట్ల నిధులను కార్మికులకు ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా నాయకులు కొమ్ముల సురేష్, బత్తుల బాలకోటయ్య, షేక్ జానీ మస్తాన్, పటాన్ పాల్గొన్నారు.

విజయవాడ వరద ముంపు

చంద్రబాబు వైఫల్యమే..

- తప్పు కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- త్వరగా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్



నరసరావుపేట: విజయవాడ వరద ముంపునకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో వరదల పరిస్థితిపై స్పందించారు. బుడమేరు పైనున్న గేట్లు ఎత్తివేయటం ద్వారా వరద నీరు విజయవాడను ముంచెత్తిందన్నారు. వరదలు వస్తున్నాయని ప్రభుత్వానికి ముందే తెలిసినా ప్రజలకు సమాచారం ఇవ్వకపోవటం దారుణమని అన్నారు. తమకు ముందే తెలుసునని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా తనే ప్రింట్ మీడియాకు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తప్పు కప్పిపుచ్చుకునేందుకు అహోరాత్రులు కష్టపడ్డానంటూ మీడియా ప్రచారం మొదలు పెట్టాడని ఆరోపించారు. అయితే అతను చేసే డ్రామాలు సోషల్ మీడియా ద్వారా ప్రజల అర్థం చేసుకున్నారన్నారు. వరదల కారణంగా తాను నివాసం ఉండే కరకట్టపైనున్న ఇల్లు మునిగిపోతే ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో కృష్ణాజిల్లా కలెక్టరేట్ వద్ద బస్సులో నివాసం ఉంటూ వరదల నివారణకు అహర్నిశలు కష్టపడ్డట్లుగా బిల్డప్ క్రియేట్ చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రిటైనింగ్ వాల్ నిర్మించటం వలన విజయవాడ వాసులకు పెద్దమేలు జరిగిందన్నారు. మరో 80వేలు నుంచి ఒక లక్ష కుటుంబాలు ఈ రిటైనింగ్ వాల్ వలన ముంపు ప్రమాదం నుంచి తప్పించుకున్నారని వివరించారు. దీనిని ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. బోట్లు వదిలి ప్రకాశం బ్యారేజ్‌కు ప్రమాదం తీసుకురావాలని వైఎస్సార్ సీపీ వర్గీయులు మూడు బోట్లు వదిలారనే సీఎం చంద్రబాబు, హోం మంత్రి, టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు సత్యదూరం అన్నారు. కేవలం మూడు బోట్లు వలన కూలిపోయేంత స్థితిలో ప్రకాశం బ్యారేజ్ లేదు అన్నారు. వరద నివారణలో వైఫల్యం చెందిన చంద్రబాబు డైవర్షన్ పాలిట్రిక్స్‌కు తెరతీశాడని, అందులో భాగమే ఈ బోట్లు ఆరోపణలు అన్నారు.

వలంటీర్లు ఉంటే సేవలు..

వలంటీర్లు ఉన్నట్లయితే తమకు కేటాయించిన ఇళ్లలోని బాధితులకు సహాయం అందజేసేవారన్నారు. వారు లేకపోవటంతో ప్రభుత్వం నుంచి, సహాయార్థుల నుంచి అందే నిత్యావసరాలు అందిన వారికే అందుతున్నాయని, లోతట్టు కాలనీల్లో నివాసం ఉండేవారెవరికీ అందడం లేదని పేర్కొన్నారు. అధికారులు ద్వారా పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు లేవు అన్నారు. ఇప్పటికి ప్రభుత్వం ఏర్పడి 90రోజులు అవుతుండగా మూడురోజుల్లో వచ్చిన వరదను గుర్తించలేక విఫలమై మాజీ సీఎం జగన్‌పై నెపం వేయటం ఏమాత్రం సబబుకాదని డాక్టర్ గోపిరెడ్డి అన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. పట్టణంలోని పండరీపురం, బ్యాంకు కాలనీ, ఐటీసీ కంపెనీ ప్రాంతం, ఎన్‌ఆర్‌టీ సెంటర్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

వరి సాగులో మెలకువలు తప్పనిసరి

శావల్యాపురం: వరి సాగులో మెలకువలు పాటించాలని వినుకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) బోయపాటి రవిబాబు అన్నారు. బుధవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో ఏడీఏ మాట్లాడారు. వ్యవసాయ అధికారులు సూచనలు మేరకు విత్తనాలను ఎంచుకొని సస్య రక్షణ చర్యలు చేపడితే ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయన్నారు. నారుమడి రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలన్నారు. లైసెన్స్ కలిగిన దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు. బిల్లులు తప్పని సరిగా తీసుకోవాలని చెప్పారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

నాదెండ్ల: సాతులూరులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పారిశుద్ధ్యం లోపించింది. మంగళవారం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పర్యటన సందర్భంగా స్థానికులు పారిశుద్ధ్య సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో సమస్యలు పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాఘవయ్య పర్యవేక్షించారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

నాదెండ్ల: ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి తీవ్రగాయాలపాలైన మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఎస్ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా కారంపూడి మండలం పేటసనిగండ్లకు చెందిన బొక్కా ఇస్సాకు, ఆయన భార్య కుమారి(33) కొంతకాలంగా గుంటూరులో ఉంటున్నారు. మంగళవారం ఉదయం భర్త ఇస్సాకుతో కలసి బైక్‌పై నరసరావుపేట నుంచి గుంటూరు వెళ్తున్నారు. సాతులూరులోని చందవరం సెంటర్‌కు రాగానే స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పింది. వాహనం వెనుక కూర్చుని ఉన్న కుమారి రోడ్డుపై పడటంతో తలకు గాయమైంది. బాధితురాలికి నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి జక్రమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ పద్మ మాట్లాడుతూ తల్లులు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఐరన్, కాల్షియం ఎంతో అవసరమని, కూరగాయలు, తృణధాన్యాలు, పండ్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఎంఎస్‌కే లక్ష్మీప్రసన్న, కె ఖాదర్‌బీ, అరుణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాదెండ్ల: బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఎస్ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాలు.. తూబాడు ఎస్సీ కాలనీకి చెందిన వాసిమళ్ల సంగీతరావు(73) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. ఈ నెల 29న కుమారుడు నాగేశ్వరరావుతో కలసి బైక్‌పై తూబాడు నుంచి గణపవరం మీదుగా చిలకలూరిపేట వెళ్తున్నాడు. కుప్పగంజివాగు చప్టా వద్దకు రాగానే తిమ్మాపురం నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన సంగీతరావును జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు.